సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ◆ 22 ◆ ఆగస్టు ◆ 2023



భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగుల పంచమిని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలో పాలు పోసి నాగదేవతను వేడుకున్నారు. 9లో▸



గులాబీ గెలుపు గుర్రాలు వీరే..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆయా అభ్యర్థుల రాజకీయ నేపథ్యం.. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సంబంధిత అధికారులు సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వాటిని పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, డీఏవో వర్ణ, సూపరింటిండెంట్ నలంద ప్రియ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను సోమవారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ, వైద్యశాఖలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. కోవిడ్ సమయంలో తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేశామని, ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇందులో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అనిల్, గీతేష్, శివ, దత్తు, రమణ, నవీన్, ప్రవీణ్, ప్రశాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తులు..



దరఖాస్తు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ 'కంది'

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం ఆ పార్టీ జిల్లా నాయకులు సోమవారం విడివిడిగా దరఖాస్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల నుంచి ఆపార్టీ అధిష్టానం దరఖాస్తులు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి సంయుక్తంగా మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండేతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు తమ దరఖాస్తులు అందజేశారు. కాగా ఇటీవల పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎన్‌ఆర్‌ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం వేరుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసి తన దరఖాస్తు అందజేశారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి


ఎదులాపురం: కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంల సమ్మె ఏడో రోజుకు చేరగా, సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ఎంపీహెచ్‌ఏ(ఎఫ్)ను వెంటనే రద్దు చేయాలన్నారు. అలాగే ఖాళీ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం ఏఎన్‌ఎంలను యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామన్నారు. ఇందులో ఏఎన్‌ఎంలు పుష్ప, ఆనందబాయి, లలిత, సునీత, సావిత్రి, స్వప్న, లక్ష్మీ, మమత, రమ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..

- ఎంపీగా పోటీ చేస్తా..
- మాజీ ఎంపీ గొడం నగేశ్

బోథ్: తాను బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని, ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ నగేశ్ తెలిపారు. బోథ్ అసెంబ్లీ టికెట్ ఆశించిన ఆయనకు అధిష్టానం టికెట్ ఇవ్వలేదు. అయితే తాను బీజేపీలోకి వెళ్తున్నట్లు వస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తాను ఎంపీగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు కొంతమంది అసత్య ప్రచారం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు.

ఉత్కంఠకు తెర



- బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు
- ఆదిలాబాద్‌కు రామన్న, బోథ్‌కు అనిల్ జాదవ్
- సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావుకు దక్కని టికెట్
- నగేశ్ సహా పలువురి ప్రయత్నాలు విఫలం



అనిల్ జాదవ్ ఇంటి వద్ద టపాసులు కాల్చి సంబరాలు



ఎమ్మెల్యే జోగు రామన్నను భుజాన ఎత్తుకొని సంబరాలు జరుపుకుంటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి,ఆదిలాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా విషయంలో ఉత్కంఠకు తెర పడింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం పార్టీపరంగా బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. రాష్ట్రంలో అధికంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకే చోటు దక్కగా, ఉమ్మడి జిల్లా పరంగా పరిశీలిస్తే.. బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ మూడు ఎస్టీ నియోజకవర్గాల్లో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, ఆత్రం సక్కులకు చుక్కెదురైంది. ఇక్కడ బోథ్ నుంచి జెడ్పీటీసీ జాదవ్ అనిల్ కుమార్, ఖానాపూర్ నుంచి భూక్యా జాన్సన్ నాయక్, ఆసిఫాబాద్ నుంచి కోవ లక్ష్మిలను ప్రకటించారు. ఇక ఆదిలాబాద్ జనరల్ స్థానం నుంచి ఎమ్మెల్యే జోగు రామన్న మరోసారి బరిలో నిలవనున్నారు.

తీవ్ర ప్రయత్నాలు..

బోథ్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మరోసారి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయనకు నిరాశే ఎదురైంది. మాజీ ఎంపీ గొడం నగేశ్ కూడా విస్తృతంగా ప్రయత్నించారు. ఆయనకు కూడా మొండి చెయ్యి ఎదురైంది. ఖానాపూర్ నుంచి రేఖానాయక్‌కు అధిష్టానం ఆశీస్సులు దక్కలేదు. ఆమెతో పాటు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఐఏఎస్ శర్వన్ నాయక్ సైతం ప్రయత్నాలు చేశారు. కేటీఆర్‌కు ఆప్తుడుగా ఉన్న జాన్సన్ నాయక్ రానున్న ఎన్నికల్లో పార్టీ పరంగా అభ్యర్థిగా బరిలో దిగనున్నారు.

బీఆర్‌ఎస్ సంబరాలు

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్యే జోగు రామన్నకు మరోసారి టికెట్ ఖరారుకావడంపై స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచారు. ఎమ్మెల్యే రామన్నను భుజాన ఎత్తుకొని నృత్యాలు చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, అష్రఫ్, నాయకులు సాజిద్ పాల్గొన్నారు. అలాగే బోథ్ నియోజకవర్గంలో అనిల్‌జాదవ్‌కు టికెట్ దక్కడంపై పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగారు.

బాపురావుకు నో..



ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

ప్రస్తుతం బోథ్ నుంచి ఎమ్మెల్యేగా రాథోడ్ బాపురావు ఉన్నారు. అయితే మూడోసారి పార్టీ పరంగా పోటీ చేయాలనుకున్న ఆయన ఆశలు అడియాశలయ్యాయి. ఇటీవల ప్రగతి భవన్ నుంచి పిలుపు రావడంతో హైదరాబాద్ వెళ్లిన ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావును కలిశారు. అప్పుడే ఈసారి టికెట్ ఇవ్వడంలేదని వారు చెప్పడం జరిగింది. అయితే అప్పటి నుంచి అక్కడే ఉన్న ఆయన ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఆదివారం తన అనుచరులు జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం పెట్టి మరోసారి రాథోడ్ బాపురావుకే టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బయట జరిగే ప్రచారాలు, ఊహాగానాలు నమ్మవద్దని చెప్పారు. చివరికి జాబితాలో చోటు దక్కకపోవడంతో వారంతా నిరుత్సాహానికి గురయ్యారు.

వరుసగా రెండుసార్లు..

ఉద్యమ కాలం నుంచి టీఆర్‌ఎస్(ప్రస్తుత బీఆర్‌ఎస్)లో కొనసాగిన రాథోడ్ బాపురావు అప్పట్లోనే ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేశారు. 2014లో పార్టీ పరంగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన జాదవ్ అనిల్‌పై గెలుపొందారు. 2018లోనూ మరోసారి టికెట్ దక్కించుకొని పార్టీ పరంగా పోటీచేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి సోయం బాపురావుపై గెలుపొందారు. మూడోసారి పార్టీ నుంచి పోటీ చేయాలని భావించినప్పటికీ అదృష్టం కలిసి రాలేదు. టికెట్ దక్కని ఆయన భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉంటుందనే విషయంలో స్పష్టత లేదు. జిల్లాకు తిరిగి వచ్చిన ఆయన తన అనుచరులతో చర్చించిన తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అనేది వేచిచూడాల్సిందే. పార్టీ అభ్యర్థికి సహకరించాలన్న అధిష్టానం సూచనలు పాటిస్తారా.. లేనిపక్షంలో ఆయన నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

ఆరోసారి బరిలో..



జోగు రామన్న

- ఎమ్మెల్యే జోగు రామన్నకే ఆదిలాబాద్ టిక్కెట్
- నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపు
- ఒకసారి మంత్రిగా..

ఎమ్మెల్యే జోగు రామన్న ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఆరోసారి బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి నాలుగోసారి పోటీకి రెడీ అంటున్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన జాబితాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో తిరిగి ఆయనకు చోటు దక్కింది. నాలుగు సార్లు శాసన సభ్యుడిగా గెలిచిన ఆయన 2014 తెలంగాణ మొదటి శాసన సభకు ఎన్నికై రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

తొలిసారి ఎమ్మెల్యేగా ఓటమి..

జోగు రామన్న రాజకీయ చరిత్రలో గెలుపోటములు ఉన్నాయి. 2004లో టీడీపీ అభ్యర్థిగా ఆదిలాబాద్ నుంచి పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి సి.రాంచంద్రారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2009లో టీడీపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సీఆర్ఆర్‌పైనే గెలుపొందారు. తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో 2011లో టీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ఆ ఏడాది నవంబర్‌లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. 2012 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల్లో మరోసారి సీఆర్ఆర్‌పై గెలిచారు. ఆ తర్వాత 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌పై గెలుపొందారు. 2018లోనూ మరోసారి టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన ఆయన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన శంకర్‌పై గెలుపొందారు.

రాజకీయ చరిత్ర..

టీడీపీతో జోగు రాజకీయ ఆరంగేట్రం జరిగింది. 1984లో పార్టీలో చేరారు. 1988 నుంచి 1995 వరకు దీపాయిగూడ సర్పంచ్‌గా వ్యవహరించారు. 1995 నుంచి 2001 వరకు జైనథ్ ఎంపీపీగా కొనసాగారు. తర్వాత జైనథ్ జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. కిందిస్థాయి పదవుల నుంచి ఎమ్మెల్యే, మంత్రి వరకు ఎదిగారు.

బీఆర్‌ఎస్‌తో కలిసొచ్చేనా..



అనిల్ జాదవ్

- బోథ్ నుంచి అనిల్‌జాదవ్‌కు అవకాశం
- గతంలో మూడుసార్లు ఓటమి
- స్వతంత్ర అభ్యర్థిగా ఓట్లు సాధించడంతో గుర్తింపు

గతంలో మూడుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా బోథ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అనిల్ జాదవ్ ఈసారి బీఆర్‌ఎస్ నుంచి కలిసొస్తుందో.. లేదోననేది కాలం నిర్ణయించనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం పార్టీ పరంగా పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించగా, అందులో బోథ్ నియోజకవర్గం నుంచి అనిల్ జాదవ్ పేరు ఉంది. అధికార పార్టీ నుంచి బీఆర్‌ఎస్ జెడ్పీటీసీగా కొనసాగుతున్న ఆయన వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా పార్టీ పరంగా టికెట్ సాధించాలని విశ్వప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. ఇటీవల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో ఉండడం ద్వారా అధిష్టానం దృష్టిలో పడడంతో పాటు నియోజకవర్గంలోని ఇతర ద్వితీయశ్రేణి నేతల సపోర్ట్‌ను సాధించడంలో విజయం సాధించారు.

రెండు దశాబ్దాల రాజకీయం..

అనిల్ జాదవ్ రెండు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. మొదట టీఆర్‌ఎస్ పార్టీ నుంచి ప్రస్థానం ప్రారంభమైనప్పటికీ ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. తిరిగి మాతృ పార్టీలోనే చేరి ప్రస్తుతం జెడ్పీటీసీగా కొనసాగుతున్నారు. ఆయన తండ్రి నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామపంచాయతీకి నాలుగు సార్లు సర్పంచ్‌గా పనిచేశారు. మొత్తంగా రాజకీయ కుటుంబం నుంచే అనిల్ జాదవ్ వచ్చారు. ఉద్యమ కాలంలో టీఆర్‌ఎస్‌లో చేరిన అనిల్ జాదవ్ 2004లోనే బోథ్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ నుంచి టికెట్ ఆశించారు. అయితే అప్పట్లో అనూహ్యంగా టీఆర్‌ఎస్ నుంచి సోయం బాపురావుకు టికెట్ దక్కడంతో నిరుత్సాహం చెందారు. అప్పటికీ పార్టీలోనే కొనసాగినప్పటికీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2009లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికి అప్పుడు టీడీపీ అభ్యర్థి గొడం నగేశ్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2014లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన టీఆర్‌ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపురావు చేతిలో ఓటమి చవిచూశారు. 2018లో కాంగ్రెస్ టిక్కెట్ బోథ్ నుంచి సోయం బాపురావుకు దక్కడంతో అనిల్‌జాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. మూడో స్థానంలో నిలిచినప్పటికీ 28,206 ఓట్లు సాధించడం ద్వారా గుర్తింపు పొందారు.

జిల్లా ఓటర్లు @ 4,33,491

- ముసాయిదా జాబితా విడుదల
- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- కొత్తగా పెరిగిన ఓటర్లు 7,395
- నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆదిలాబాద్	1,12,888	1,16,120	07
బోథ్	1,00,052	1,04,421	03



ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 4,33,491 మంది ఓటర్లున్నట్లుగా తేలింది. ఇందులో పురుష ఓటర్లు 2,12,940 మంది ఉండగా, మహిళ ఓటర్లు 2,20,541 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరి 1న ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో 4,26,096 మంది ఉండగా ఇటీవల చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా కొత్తగా 7,395 మంది నమోదయ్యారు. ఈ జాబితాలను కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల నోటీసుబోర్డులపై ప్రదర్శించనున్నారు. అలాగే జిల్లాలోని బీఎల్ఓల వద్ద కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఈ నెల 22నుంచి సెప్టెంబర్ 19వరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. జిల్లాకు చేరిన ఓటర్ల జాబితాలను సోమవారం ఆయా మండలాల ఆర్ఐలు, సంబంధిత అధికారులకు అందజేశారు.

అతివలే అధికం..

ఆదిలాబాద్ జిల్లాలో పురుష ఓటర్లతో పోల్చితే 7,601 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జనవరి నుంచి గత నెల వరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా 7,395 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన ఓటర్ల జాబితాలో జిల్లాలో 4,26,096 మంది ఉండగా తాజాగా ఈ సంఖ్య 4,33,491కి చేరింది.

26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 26, 27వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్ఓలు ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటరు జాబితాలతో అందుబాటులో ఉండనున్నారు. జాబితాలో పేర్లను సరి చూసుకుని లేనట్లైతే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ తేదీల్లో తప్పిపోయిన వారెవరైనా ఉంటే తిరిగి సెప్టెంబర్ 2, 3వ తేదీల్లోనూ నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ నెలలో అందిన దరఖాస్తులతో పాటు అభ్యంతరాలను సెప్టెంబర్ 28లోగా పరిష్కరించి అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేయనున్నారు.

లక్కు..కిక్కు

- 31 వైన్స్‌లకు లక్కీ డ్రా
- నారీమణులకు దక్కిన ఆరు షాపులు
- తొమ్మిది షాపుల కేటాయింపు వాయిదా
- కలెక్టర్ సమక్షంలో ప్రక్రియ



విజేతలను ప్రకటిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



లక్కీడ్రాలో పాల్గొన్న టెండర్‌దారులు

ఆదిలాబాద్‌టౌన్: అదృష్టవంతులను 'కిక్కు' వరించింది. మద్యం షాపులు దక్కించుకున్న వారిలో జోష్ నింపగా.. డ్రాలో పేర్లు రానివారు నిరాశతో వెనుదిరిగారు. జిల్లాలో 40 వైన్స్‌లు ఉండగా, తక్కువ దరఖాస్తులు వచ్చిన తొమ్మిదింటి డ్రా వాయిదా వేశారు. జిల్లా కేంద్ర సమీపంలోని మావలలో గల రత్నా గార్డెన్స్‌లో సోమవారం లక్కీ డ్రా నిర్వహించారు. 2023–25 ఎక్సైజ్ కొత్త మద్యం పాలసీ టెండర్లలో భాగంగా 31 దుకాణాల కోసం కలెక్టర్ రాహుల్‌రాజ్ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో ఎక్సైజ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులను మాత్రమే అనుమతించారు. పలువురు మహిళలు టెండర్లు వేయగా, ఇందులో ఆరుగురికి షాపులు దక్కాయి. డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు కేటాయించనున్నారు.

లక్కీ పర్సన్లు..

మద్యం కొత్త పాలసీ కోసం జిల్లాలోని 40 షాపులకు గాను 975 దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిది షాపులకు తక్కువ దరఖాస్తులు రావడంతో వాటిని వాయిదా వేశారు. డ్రాలో ఎంపికైన 31 మంది అదృష్టవంతులను కలెక్టర్ ప్రకటించారు. షాపుల నిర్వహణకు రెండేళ్ల కాలపరిమితి ఉంది. జిల్లాలో మూడు స్లాబ్‌లుగా లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంది. షాపులు దక్కించుకున్న వారు 1/6వ వంతు ఫీజు చెల్లించారు. వీరి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి షాపు నుంచి లక్కీడ్రా తీశారు. ఎంపికైన వారు సంతోషంలో మునిగితేలగా, మిగతా వారు నిరుత్సాహంగా కనిపించారు.

నారీమణులకు.. ఆరు షాపులు

జిల్లాలో ఆరుగురు మహిళలకు షాపులు దక్కాయి. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో షాప్ నం.2, 3, 8, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో షాప్ నం. 23, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో షాప్ నం.33, 38 ఉన్నాయి. తమ కుటుంబీకులకు సంబంధించిన మహిళల పేరిట షాపులు రావడంతో వారు సంబరాల్లో మునిగితేలారు. కాగా మద్యం లక్కీడ్రాకు అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

సందడే సందడి..

జిల్లా నలుమూలల నుంచి టెండర్‌దారులతో పాటు వారి మద్దతుదారులు భారీగా తరలివచ్చారు. దీంతో మావలలోని రత్నా గార్డెన్ ప్రాంతం సందడిసందడిగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆదిలాబాద్‌రూరల్ సీఐతో పాటు మావల, ఆదిలాబాద్‌రూరల్ ఎస్సైల ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. దరఖాస్తుదారులను మాత్రమే లోనికి అనుమతించారు. వారి మద్దతుదారులు గార్డెన్‌లో ఉండడంతో గార్డెన్ కిక్కిరిసిపోయింది.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఉత్సాహంగా 5కే రన్



5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్: ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' కార్యక్రమంలో భాగంగా సోమవారం 5కే రన్ నిర్వహించారు. కలెక్టర్ క్రీడా జ్యోతి వెలిగించి రన్‌ను ప్రారంభించారు. కలెక్టరేట్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్ మీదుగా రన్ తిరిగి స్టేడియానికి చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బూత్‌స్థాయి అధికారుల వద్ద లేదా ఆన్‌లైన్‌లో ఫామ్-6 ద్వారా తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొందాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకొని, సరైన నాయకత్వాన్ని ఎన్నుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్: గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని డీఈవో ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి అండర్-17 బాలికల కబడ్డీ పోటీలను పార్థసారథి ప్రారంభించగా, ముగింపు వేడుకలకు డీఈవో హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పెటా సెక్రటరీ స్వామి, కబడ్డీ కార్యదర్శి రాష్ట్ర పాల్, సెలక్షన్ కమిటీ సభ్యులు నాందేవ్, త్రివేణి, విఠల్‌రెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతగా ఈఎంఆర్ఎస్ ఉట్నూర్

జిల్లాస్థాయి అండర్ -17 బాలికల కబడ్డీ పోటీల్లో ఉట్నూర్ ఏకలవ్య స్కూల్ (బాలికలు) విజేతగా నిలిచింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల బంగారుగూడ జట్టుపై విజయం సాధించారు.


గులాబీ గెలుపు గుర్రాలు వీరే..

- బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్‌
- జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు దక్కని టికెట్‌ • అభ్యర్థుల నేపథ్యం ఇదీ..

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో బీఆర్‌ఎస్‌ దూకుడు పెంచింది. అందరికంటే ముందుగానే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ముగ్గురు సిట్టింగులకు చాన్స్‌ దక్కలేదు. వారిస్థానంలో కొత్తవారికి టికెట్‌ ఇచ్చారు. నియోజకవర్గాల వారీగా మొత్తం పది మంది అభ్యర్థుల రాజకీయ నేపథ్యం ఇలా ఉంది..

నిర్మల్‌ నియోజకవర్గం





పేరు : అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
తల్లిదండ్రులు : నారాయణరెడ్డి, చిన్నమ్మ
భార్య : విజయలక్ష్మి
కూతురు, అల్లుడు : పల్లవిరెడ్డి, రంజిత్‌రెడ్డి
కుమారుడు, కోడలు : గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి
పుట్టినతేదీ : 16–02–1949
విద్యార్హత : బీకాం, ఎల్‌ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం

- 1987లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్మన్‌గా వ్యవహరించారు.
- 1991లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2008 పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి 2009 వరకు ఆదిలాబాద్‌ ఎంపీగా ఉన్నారు.
- 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా గెలిచి సెప్టెంబర్‌ వరకు రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రిగా కొనసాగారు.
- 2018నుంచి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్‌ నియోజకవర్గం






పేరు : కోవ లక్ష్మి
భర్త : సోనేరావ్‌
తండ్రి : కోట్నాక్‌ భీంరావ్‌ (గిరిజన సంక్షేమశాఖ మాజీమంత్రి)
తల్లి : భీంబాయి
కులం : ఎస్టీ(గోండు)
పుట్టిన తేదీ : 6–2–1969
విద్యార్హత : పదోతరగతి
సంతానం : కుమార్తెలు అరుణ (సిర్పూర్‌(యూ) జెడ్పీటీసీ, మాన్విత, కుమారుడు సాయినాథ్‌
రాజకీయ ప్రస్థానం : 1995, 2001లో తిర్యాణి మండలం పంగిడిమాదర నుంచి ఎంపీటీసీ
2002 : తిర్యాణి ఎంపీపీగా
2006 ఆసిఫాబాద్‌ సర్పంచ్‌
2010 : టీఆర్‌ఎస్‌(ప్రస్తుత బీఆర్‌ఎస్‌)లో చేరిక
2013 : రెండోసారి ఆసిఫాబాద్‌ సర్పంచ్‌గా ఎన్నిక
2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
2018 : ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు.
2019 : జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక

సిర్పూర్‌(టి) నియోజకవర్గం





పేరు : కోనేరు కోనప్ప
తల్లిదండ్రులు : సూర్య నారాయణ, కృష్ణవేణి
కులం : ఓసీ (కమ్మ)
పుట్టిన తేదీ : 07–10–1955
విద్యార్హత: ఇంటర్‌
భార్య: రమాదేవి
పిల్లలు : కూతురు ప్రతిమ, కుమారుడు వంశీకృష్ణ
నివాసం : గుంటూరు కాలనీ, కాగజ్‌ నగర్‌
రాజకీయ ప్రస్థానం :
1999 : కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
2004 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
2009 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
2014 : బీఎస్పీ నుంచి గెలుపుపొంది టీఆర్‌ఎస్‌లో చేరారు.
2018 : టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

చెన్నూర్‌ నియోజకవర్గం





పేరు: బాల్క సుమన్‌
తల్లిదండ్రులు: బాల్క సురేశ్‌, ముత్తమ్మ
కులం: మాల
పుట్టినతేదీ: 18–10–1983
భార్య : రాణి అలేఖ్య
కుమారులు : సుహాన్‌, సుషన్‌
స్వస్థలం : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం, రేగుంట
విద్యాభ్యాసం: డిగ్రీ
రాజకీయ ప్రస్థానం :

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. 2007లో టీఆర్‌ఎస్వీ ఓయూ అధ్యక్షుడిగా, 2010లో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు.
- 2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి టీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్‌ అభ్యర్థి గడ్డం వివేకానందపై 2.91 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్‌ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్‌ అభ్యర్థి బోర్లకుంట వెంకటేశ్‌ నేతపై 28,132 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం చెన్నూర్‌ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గం





పేరు: దుర్గం చిన్నయ్య
తల్లిదండ్రులు: దుర్గం రాజయ్య, మల్లక్క
భార్య:జయతార
సంతానం: ఇద్దరు కూతుర్లు (నిహారిక , విహారిక)
కులం: ఎస్సీ (నేతకాని)
పుట్టినతేదీ: 31–05–1972
విద్యార్హత: డిగ్రీ, బీఏ
స్వస్థలం: జిందా వెంకటాపూర్‌, నెన్నెల (మం) వృత్తి:వ్యవసాయం
నివాసం: మంచిర్యాల
రాజకీయ ప్రస్థానం

- 1995 లో టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగప్రవేశం.
- 1995 లో నెన్నెల జెడ్పీటీసీగా టీడీపీ నుండి పోటీచేసి విజయం సాధించారు.
- 2001లో టీడీపీ నుండి జంగాల్‌పేట్‌ ఎంపీటీసీగా గెలిచి నెన్నెల ఎంపీపీగా గెలిచారు.
- 2009 లో టీఆర్‌ఎస్‌లో చేరిక
- 2011లో బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.
- 2014 లో చిత్తాపూర్‌ ఎంపీటీసీగా టీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ముథోల్‌ నియోజకవర్గం





పేరు : గడ్డిగారి విఠల్‌రెడ్డి
తల్లిదండ్రులు : గడ్డెన్న, రాజమ్మ
పుట్టినతేదీ : 06–08–1954
పుట్టిన ఊరు : దేగాం, భైంసా మండలం
విద్యార్హత : బీఏ, ఎల్‌ఎల్‌బీ
భార్య : గడ్డిగారి లక్ష్మి
కూతురు, అల్లుడు : సులోచన, శ్రీనివాస్‌రెడ్డి
కుమారుడు, కోడలు : రాంరెడ్డి, అక్షయ
రాజకీయ ప్రస్థానం

- 2006 నుంచి 2008 వరకు భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పీఆర్పీ నుంచి పోటీ చేసి కేవలం 183 ఓట్లతో ఓడిపోయారు.
- 2010 నుంచి 13వరకు మరోసారి భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2014 ఆగస్టు 6న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి రెండోసారి బంపర్‌ మెజార్టీతో గెలిచారు.

మంచిర్యాల నియోజకవర్గం





పేరు : నడిపెల్లి దివాకర్‌రావు
తల్లిదండ్రులు: రమాదేవి, లక్ష్మణ్‌రావు
భార్య: రాజకుమారి
కుమారులు: రంజిత్‌, విజిత్‌కుమార్‌
స్వస్థలం: పాతమంచిర్యాల
పుట్టినతేదీ : 15 ఆగస్టు, 1952
విద్యార్హత : బీఏ(పొలిటికల్‌ సైన్స్‌)

- 1981లో మంచిర్యాల మున్సిపల్‌ కౌన్సిలర్‌
- 1987లో మంచిర్యాల సింగిల్‌ విండో చైర్మన్‌
- 1982–1992 వరకు మంచిర్యాల బ్లాక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి
- 1999 వరకు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా పనిచేశారు
- 1999 అసెంబ్లీ ఎన్నికల్లో లక్సెట్టిపేట నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.
- 2015 నుంచి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ అండర్‌ టేకింగ్స్‌ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి టీఆర్‌ఎస్‌ నుంచే పోటీచేసి విజయం సాధించారు.

ఆదిలాబాద్‌ నియోజకవర్గం





పేరు :జోగు రామన్న
తల్లిదండ్రులు: జోగు ఆశన్న, భోజమ్మ
భార్య : రమ
కుమారులు : ప్రేమేందర్‌, మహేందర్‌
స్వగ్రామం : దీపాయిగూడ, జైనథ్‌ మండలం
విద్యార్హత : బీఏ
రాజకీయ ప్రస్థానం..

- 1984లో టీడీపీలో చేరిక
- 1988 నుంచి 1995 వరకు దీపాయిగూడ సర్పంచ్‌గా, మండల పరిషత్‌ ఉపాధ్యక్షునిగా పనిచేశారు.
- 1995 నుంచి 2001 వరకు జైనథ్‌ ఎంపీపీగా..
- 2001 నుంచి 2009 వరకు జైనథ్‌ జెడ్పీటీసీగా
- 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2010లో తెలంగాణ నగారా సమితిలో చేరిక
- 2011లో టీఆర్‌ఎస్‌లో చేరి 2012 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు.
- 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించారు.
- 2019 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

బోథ్‌ నియోజకవర్గం





పేరు : అనిల్‌జాదవ్‌
తల్లిదండ్రులు : యశోద, జాదవ్‌ రామారావు
భార్య : హరిప్రియ
కుమారులు :ఆర్యన్‌, అర్జున్‌
పుట్టినతేదీ : 16–06–1972
స్వస్థలం: రాజురా
మండలం: నేరడిగొండ
నియోజకవర్గం: బోథ్‌ (ఎస్టీ)
విద్యార్హతలు :బీఏ, పొలిటికల్‌ సైన్స్‌
రాజకీయ ప్రస్థానం:

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక, 2004 ఎన్నికలలో టికెట్‌ ఆశించారు. చివరి నిమిషంలో సోయం బాపురావు పార్టీలో చేరి టికెట్‌ దక్కించుకోవడంతో టీఆర్‌ఎస్‌ పార్టీలో ఉండి 'సోయం' గెలుపు కోసం కృషి చేశారు.
- 2007 లో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.
- 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
- 2018లో ఇండిపెండెంట్‌గా అభ్యర్థిగా పోటీ
- 2019 మార్చి 21న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2019లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి నేరడిగొండ జెడ్పీటీసీగా విజయం సాధించారు.

ఖానాపూర్‌ నియోజకవర్గం





పేరు : భూక్య జాన్సన్‌ నాయక్‌
తల్లిదండ్రులు : భూక్య శామ్యూల్‌నాయక్‌, కేస్లీబాయి
పుట్టినతేదీ : 06–06–1976
భార్య : జయలక్ష్మి
సంతానం : కుమారుడు
విద్యార్హత : జెనిటిక్స్‌లో డిగ్రీ, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌లో పీజీ డిప్లొమా
పుట్టిన ఊరు: తిమ్మాపూర్‌ తండా, మం.ఇబ్రహీంపట్నం, జి.జగిత్యాల
రాజకీయ ప్రస్థానం
2009లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ టికెట్‌కోసం ప్రయత్నాలు చేశారు.

నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌



పీవోను సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌ నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. నాగులపంచమి పురస్కరించుకుని సోమవారం ఆలయంలో పూజలు చేశారు. మెస్రం వంశీయులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకార మండపం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ముత్నూర్‌ నుంచి కేస్లాపూర్‌ బీటీ రోడ్డు మరమ్మతు పనులు చేపడుతామన్నారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, ఆలయ కమిటీ చైర్మన్‌ మెస్రం తుకారం, మెస్రం వంశం ఉద్యోగులు మనోహర్‌, శేఖర్‌బాబు, దేవ్‌రావ్‌, మెస్రం వంశం పెద్దలు బాదిరావ్‌, కోసేరావ్‌ కటోడ, కోసేరావ్‌, దేవ్‌రావ్‌, నాగ్‌నాథ్‌ ఉన్నారు.

ఆ అధికారి తిట్ల పురాణమే !

- కిందిస్థాయి ఉద్యోగులకు తీవ్ర వేధింపులు
- విచారణ చేపడుతామన్న రిమ్స్‌ డైరెక్టర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: ఎన్ని విమర్శలు వచ్చినా..అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఆ అధికారి తీరులో మార్పు రావడం లేదు. కిందిస్థాయి ఉద్యోగులంటే ఆమెకు చులకన అనే రీతిలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రిమ్స్‌లో పనిచేసే ఆ అధికారి గతంలో సిబ్బందిని వేధింపులకు గురిచేయడం, తన జన్మదినం సందర్భంగా వారి నుంచి కానుకలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై 'రిమ్స్‌లో కలెక్షన్‌ క్వీన్‌'అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, అప్పట్లో కలెక్టర్‌ విచారణ జరిపారు. కాగా ఇటీవల కాలంలో మళ్లీ ఆ అధికారి అదేరీతిలో వ్యవహరిస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. సమస్యలు విన్నవించేందుకు వెళ్లినా తిట్ల పురాణంతో ఉతికి ఆరేస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడం, ఆ అధికారి బంధువులు వైద్య శాఖలో పనిచేస్తుండడం, వారి అండదండలతో ఇలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. మహిళా సిబ్బందిని సైతం దుర్భాషలాడుతుండడంతో వారు కంటతడి పెడుతున్నారు. సోమవారం కొందరి సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషించడంతో కన్నీరుమున్నీరైనట్లు తెలిసింది. ఈ విషయం రిమ్స్‌ డైరెక్టర్‌ దృష్టికి వెళ్లగా, ఆ అధికారిని పిలిచి ఆరా తీసినట్లు తెలిసింది. ఇలాంటివి మరోసారి పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కొందరు సిబ్బంది మూకుమ్మడిగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ విషయమై రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ను వివరణ కోరగా, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని వివరించారు.

ఫోన్‌ తీసుకున్నాడని అనుమానంతో హత్య

- యువకుడిని రాళ్లు, కర్రలతో కొట్టి..
- బేల మండలంలో ఘటన



కొడపే జీవన్‌(ఫైల్‌)

బేల: ఫోన్‌ తీసుకున్నాడని అనుమానంతో యువకుడిని హత్య చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రాధిక కథనం ప్రకారం.. మండలంలోని మశాల(కె), దుబ్బగూడ(ఎం) గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలోని భవానీగూడ(ఇ) గ్రామానికి చెందిన కొడపే జీవన్‌(25) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన లింగ్‌షాతో జీవన్‌కు పరిచయం ఉంది. తన ఫోన్‌ పోయిందని, ఆ ఫోన్‌ను తీసుకున్నాడని అనుమానంతో జీవన్‌ను రెండు రోజుల క్రితం చితకబాదాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న జీవన్‌ను కూలీ పని కోసమని చెప్పి లింగ్‌షాతోపాటు దుబ్బగూడ (ఎం) గ్రామానికి చెందిన భీంరావు బైక్‌పై తీసుకెళ్లారు. అటవీప్రాంతంలో ఫోన్‌ ఇవ్వాలని వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో వీరిద్దరితోపాటు బోరిగాంకు చెందిన దేవ్‌షా, శ్రీనులు జీవన్‌ను రాళ్లు, కర్రలతో చితకబాది హత్య చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తుడు గోడం కిశోర్‌ రాత్రి జీవన్‌ తమ్ముడు విజయ్‌కు చెప్పాడు. విజయ్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

ఇంద్రవెల్లి: నాగుల పంచమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కేస్లాపూర్‌ నాగోబా ఆలయానికి భక్తులు తరలిరావడంతో మినీ జాతర తలపించింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి పూజలు చేశారు. గంటల తరబడి లైన్‌లో ఉండి నాగోబాను దర్శనం చేసుకున్నారు. కేస్లాపూర్‌ గ్రామాభివృద్ధి కమిటీ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ మెస్రం తుకారం, సర్పంచ్‌ మెస్రం రేణుకనాగ్‌నాథ్‌, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోట్నాక్‌ బారిక్‌రావ్‌, నాగోబా యూత్‌ అధ్యక్షుడు మెస్రం శేఖ్‌నాథ్‌ ఉన్నారు.



మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



నాగోబా విగ్రహానికి భక్తుల పూజలు



భక్తజనసంద్రంగా మారిన ఆలయ ప్రాంగణం



రంగుల రాట్నాల వద్ద యువకుల సందడి

అల్లోల హ్యాట్రిక్‌ విజయం కోసం పొర్లుదండాలు



ఆలయం చుట్టూ జగన్‌ పొర్లుదండాలు

దిలావర్‌పూర్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హ్యాట్రిక్‌ విజయం సాధించాలని ఆయన అనుచరుడు, ఉద్యమకారుడు డాక్టర్‌ జగన్‌ పొర్లుదండాలతో మొక్కు తీర్చుకున్నాడు. సోన్‌ మండల కేంద్రానికి చెందిన డాక్టర్‌ జగన్‌ కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని పాపహరేశ్వరాలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. జిల్లాను ఎంతో అభివృద్ధి చేసిన మంత్రి అల్లోల మరోసారి విజయం సాధిస్తారని జగన్‌ ధీమా వ్యక్తం చేశాడు. ఆలయ కమిటీ చైర్మన్‌ నార్వాడి వెంకట్రావు, సంబాజీరావు, నాయకులు ఉన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్‌: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్‌ పేర్కొన్నారు. ఉట్నూర్‌ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎం అండ్‌హెచ్‌ఓ కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్‌, పీహెచ్‌వో సందీప్‌, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్‌ మెస్రం మనోహర్‌, డీపీవో ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

- గేదెల కొనుగోలు కోసం రుణం మంజూరు చేయాలని తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన కాశీరాం అర్జీ సమర్పించాడు.
- తనకు ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం కల్పించాలని ఉట్నూర్‌ మండలం లక్సెట్టిపేట గ్రామానికి చెందిన అనసూయ అర్జీ అందించింది.
- తనకు ఆర్థికసాయం అందించాలని సారంగపూర్‌ మండలం చించోలి గ్రామానికి చెందిన ఆత్రం భీందాస్‌ విన్నవించాడు.
- ఖానాపూర్‌ మండలం సత్తన్‌పల్లి గ్రామానికి చెందిన బోడ గణేశ్‌ తనకు కిరాణ దుకాణం మంజూరు చేయాలని కోరారు.
- పింఛన్‌, డబుల్‌ బెడ్రూం, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల్లో సమస్యలు పరిష్కరించాలని పలు అర్జీలు వచ్చాయి.